

సిద్దిపే టరూరల్ : పుల్లూరులో మాట్లాడుతున్న సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి

# మంత్రికే మామద్దతు

- కారుకే ఓటేస్తాం..హరీశన్నను గెలిపించుకుంటాం
- పుల్లూరు, బండచెర్లపల్లి, చిన్నగుండవెల్లి గ్రామాల్లో ఏకగ్రీవ తీర్మానం
- సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డికి తీర్మాన పత్రాన్ని అందజేసిన కులసంఘాల సభ్యులు
- సిద్దిపేట రూరల్ మండలంలో మంత్రి హరీశ్‌రావుకు వెల్లువలా మద్దతు

సిద్దిపేట రూరల్, నవంబర్ 11 : సిద్దిపేటను, సిద్దిపేట నియోజకవర్గంలోని గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న మంత్రి హరీశ్‌రావుకే ఓటేస్తామని సిద్దిపేట రూరల్ మండలంలోని పుల్లూరు, బండచెర్లపల్లి, చిన్నగుండవెల్లి గ్రామాల్లోని కుల సంఘాలు ఏకగ్రీవ తీర్మానం చేశాయి. శనివారం పుల్లూరు, బండచెర్లపల్లి, చిన్నగుండవెల్లి గ్రామాల్లో బీఆర్‌ఎస్ ప్రచారం జోరుగా సాగింది. సుడా చైర్మన్ మారెడ్డి రవీందర్‌రెడ్డి, జడ్పీటీసీ శ్రీహరిగౌడ్, ఎంపీపీ శ్రీదేవీరామచందర్‌రావు ఆయా గ్రామాల్లోని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. మంచి చేసిన హరీశ్‌రావును ఎప్పుడూ మరిచిపోవద్దన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అమలు చేయని పథకం అంటూ ఏదీ లేదన్నారు. ప్రతీ ఇంటికి ఏదో ఒక పథకం చేరిందని తెలిపారు. పుల్లూరులో పడమట, వెంకటయ్య చెరువులను నింపుతామన్నారు. ఏ సమస్య ఉన్నా పరిష్కరించే నాయకుడు హరీశ్‌రావును మరిచిపోవద్దన్నారు. ప్రతీ గ్రామంలో వందకు వందశాతం ఓట్లు కారుకే వేసి హరీశ్‌రావును భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని కోరారు. ఎన్నికలప్పుడు వచ్చే నాయకుల మాటలు నమ్మవద్దని, వారంతా డిసెంబర్ తర్వాత కంటికి కూడా కనబడరని గుర్తు చేశారు. పుల్లూరులోని 86మంది యువతకు, చిన్నగుండవెల్లి, బండచెర్లపల్లి యువతకు ఉచితంగా డ్రైవింగ్ లెసెన్స్‌లు హరీశ్‌రావు ఇప్పించారని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు శిక్షణతో పాటు కుట్టుమిషన్లు అందించారని తెలిపారు. హరీశ్‌రావుకు మద్దతుగా ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవ తీర్మానాలను చేసిన కులసంఘాల పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీదేవీరామచందర్‌రావు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, ఎర్రయాదయ్య, సర్పంచులు పల్లె నరేశ్‌గౌడ్, వీణాదశరథం, ఎంపీటీసీ లత, వైస్ ఎంపీపీ యాదగిరి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చింతమడకలో ప్రచార సభకు హాజరైన జనం



# గజ్వేల్ టాప్

- నామినేషన్లు సమాప్తం
- చివరి రోజు అధికంగా నామినేషన్లు దాఖలు
- గజ్వేల్‌లో అత్యధికంగా 154, దుబ్బాకలో అత్యల్పంగా 38
- ఈ నెల 13న పరిశీలన
- 15 వరకు ఉపసంహరణ గడువు




సిద్దిపేట అర్బన్, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల కోసం జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ముగిసింది. జిల్లాలోని దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో మొత్తం 320 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 3వ తేదీన నోటిఫికేషన్ రావడంతో అదే రోజు నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. 3వ తేదీ నుంచి 10 వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఈ నెల 13న నామినేషన్ల పరిశీలన ఉండగా, 15వరకు నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు. మొదటి రోజు కేవలం 3 నామినేషన్లు మాత్రమే దాఖలు కాగా, చివరి రోజు 152 దాఖలయ్యాయి. జిల్లాలో అత్యధికంగా గజ్వేల్ నియోజకవర్గంలో 154 నామినేషన్లు దాఖలు కాగా, అత్యల్పంగా దుబ్బాక నియోజకవర్గంలో 38 దాఖలయ్యాయి. సిద్దిపేట నియోజకవర్గంలో 76, హుస్నాబాద్‌లో 52 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు.

**224 మంది అభ్యర్థులు..**
**320 నామినేషన్లు..**

మొదటి రోజు గజ్వేల్ నియోజకవర్గంలో ఇద్దరు అభ్యర్థులు మూడు నామినేషన్లు దాఖలు చేయగా.. రెండో రోజు శనివారం హుస్నాబాద్‌లో ఒక అభ్యర్థి ఒకటి, సిద్దిపేటలో ఇద్దరు అభ్యర్థులు రెండు, దుబ్బాకలో ముగ్గురు అభ్యర్థులు 3 నామినేషన్లతో మొత్తం 6 దాఖలు చేశారు. మూడోరోజు సోమవారం హుస్నాబాద్‌లో ముగ్గురు అభ్యర్థులు 3, సిద్దిపేటలో ఇద్దరు అభ్యర్థులు 2, దుబ్బాకలో ముగ్గురు 3, గజ్వేల్‌లో ఒక్కరు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా.. మొత్తం 9 నామినేషన్లు దాఖలయ్యాయి. నాలుగో రోజు మంగళవారం సిద్దిపేటలో 5గురు అభ్యర్థులు 5, దుబ్బాకలో నలుగురు 4, గజ్వేల్‌లో ఆరుగురు అభ్యర్థులు 7 నామినేషన్లు దాఖలు చేయగా, మొత్తం 16 నామినేషన్లు దాఖలయ్యాయి. ఐదో రోజు బుధవారం హుస్నాబాద్‌లో ఆరుగురు అభ్యర్థులు 9, సిద్దిపేటలో 12 మంది 12, దుబ్బాకలో ఐదు మంది 5, గజ్వేల్‌లో 25 మంది 27 నామినేషన్లు మొత్తం 53 దాఖలు చేశారు. ఆరో రోజు గురువారం హుస్నాబాద్‌లో ఆరు మంది 6, సిద్దిపేటలో 17 మంది 20, దుబ్బాకలో ఐదు మంది 7, గజ్వేల్‌లో 43మంది 48 నామినేషన్లు దాఖలు చేయగా, మొత్తం 81దాఖలయ్యాయి. చివరి రోజు దుబ్బాకలో 14 మంది అభ్యర్థులు 16, హుస్నాబాద్‌లో 27 మంది అభ్యర్థులు 33, సిద్దిపేటలో 32 మంది అభ్యర్థులు 35, గజ్వేల్‌లో 68 మంది 68 నామినేషన్లు దాఖలు చేయగా.. మొత్తంగా చివరి రోజు 152 దాఖలయ్యాయి. సిద్దిపేట నియోజకవర్గంలో 39 మంది అభ్యర్థులు 76 నామినేషన్లు, గజ్వేల్ నియోజకవర్గంలో 127 మంది అభ్యర్థులు 152 నామినేషన్లు, హుస్నాబాద్‌లో 36 మంది అభ్యర్థులు 49 నామినేషన్లు, దుబ్బాకలో 22 మంది అభ్యర్థులు 38 నామినేషన్లు దాఖలు చేయగా, మొత్తం నాలుగు నియోజకవర్గాల్లో 320 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే అంధకారమే

- కాంగ్రెస్ హయాంలో కరువుకాటకాలు, కరెంట్ కష్టాలు
- బీఆర్‌ఎస్ పాలనలో బంగారు పంటలు
- దేశానికే ఆదర్శం తెలంగాణ
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు
- ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- బెజ్జంకి మండలంలో జోరుగా ఎన్నికల ప్రచారం
- పెద్దఎత్తున హాజరైన నాయకులు, కార్యకర్తలు



రోడ్ షో లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి, నవంబర్ 11: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ రాష్ట్రం అంధకారం తప్పదని రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని బెజ్జంకి క్రాసింగ్, ముత్తన్నపేట, నర్సింహులపల్లి, పోతారం, చీలాపూర్, చీలాపూర్‌పల్లి, పెరుకబండ గ్రామాల్లో శనివారం రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏండ్లు పాలన ఇచ్చిన ఏమి చేయనోల్లు ఇప్పుడు చేస్తారా..? ప్రజల్లో కాంగ్రెస్‌కు గ్యారెంటీ లేకనే మళ్లీ ప్రజల నమ్మించేందుకు గ్యారెంటీల పేరుతో మోసం చేయాలని చూస్తుందని, ప్రజలు ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో కరువు, కరెంట్ కోతలు, రైతు ఆత్మహత్యలు పెరిగి రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఓ వైపు అభివృద్ధి, సంక్షేమంతో ప్రజలకు సువర్ణ పాలనను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అందించందన్నారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీలకు ఓటేసి ఆగం కావద్దని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. అనంతరం పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన పెద్దఎత్తున యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి ఎమ్మెల్యే గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం గ్రామాలకు ప్రచారానికి వచ్చిన రసమయి బాలకిషన్‌కు గ్రామాల్లో అపూర్వ స్వాగతం లభించింది, ఎక్కడిక్కడ గ్రామాల ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావడంతో గ్రామాలు జనసంద్రంగా మారాయి. కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చంద్రకళ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలి

- సిద్దిపేట సీపీ ఎన్.శ్వేత
- కేంద్ర బలగాలకు స్వీట్లు పంపిణీ చేసి, దీపావళి శుభాకాంక్షలు తెలిపిన సీపీ

సిద్దిపేట అర్బన్/హుస్నాబాద్, నవంబర్ 11 : రాబోయే 19 రోజుల్లో ఎన్నికలు ఉన్నందున ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సిద్దిపేట సీపీ ఎన్.శ్వేత అన్నారు. శనివారం సిద్దిపేటలోని విపంచి కళానిలయం, హుస్నాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో కేంద్ర బలగాలతో సీపీ శ్వేత సమావేశం నిర్వహించారు. ముందుగా కేంద్ర బలగాలకు దీపావళి పండుగ సందర్భంగా స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రాష్ట్రాలు, దేశ బార్డర్ల నుంచి వచ్చి విధులు నిర్వహిస్తున్నందున వారిని అభినందించారు. సమష్టిగా సివిల్ పోలీసులతో కలిసి విధులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్నికల నిర్వహణలో ముఖ్యపాత్ర వహించాలని కేంద్ర బలగాలకు సూచించారు. వాహనాల తనిఖీ, ఫ్లాగ్ మార్చ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచనలు, సలహాలు చేశారు.

**సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలి**

హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించి బందోబస్తును రెట్టింపు చేయాలని సీపీ సూచించారు. హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ సతీశ్, సీఐ కిరణ్‌తోపాటు నియోజకవర్గంలోని పోలీసు అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైండోవర్లు, సీజ్ చేసిన డబ్బులు, నాన్ బెయిలబుల్ వారెంట్, ఎగ్జిక్యూటివ్ ప్రైవేట్ గన్స్ డిపాజిట్, ఫ్లాగ్ మార్చ్, ఎన్ఫోర్స్‌మెంట్ వర్క్ గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశాల్లో ఏసీపీ సురేందర్ రెడ్డి, సీఐలు కృష్ణారెడ్డి, భానుప్రకాశ్, కిరణ్, హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, ఎస్‌బీ సీఐ రఘుపతి రెడ్డి, ఎన్నికల సెల్ సీఐ భిక్షపతి, ఎస్సైలు తోట మహేశ్, వివేక్, తిరుపతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేటలో కేంద్ర బలగాలతో మాట్లాడుతున్న సీపీ శ్వేత

# దీపావళి.. ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలి

**జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి హరీశ్ రావు**



సిద్దిపేట, నవంబర్ 11: చీకటిని పారద్రోలి వెలుగునిచ్చే దీపావళి పర్వదినం ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. దీపావళి పండుగను పురస్కరించుకుని జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్వదినాన్ని ప్రజలంతా ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, చిన్నపిల్లలు కాకరొత్తులు కాల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. లక్ష్మీనారాయణుడి అనుగ్రహంతో అందరికీ శుభం చేకూరాలని, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.